

మూడు బంగారు నాణాలు

గ్రీసు కథ

అలీకి, తెలుగు: కె. సురేష్

ఈ గ్రీసు కథను అలీకి తిరిగి చెప్పింది. దానికి అందమైన బొమ్మలు వేసింది.

ఇది యానిస్ అనే పేద రైతు కథ. అతడు చాలా సంవత్సరాలపాటు ఒక సంపన్నుడి ఇంటిలో పనిచేశాడు. అందుకు ప్రతిఫలంగా యజమాని అతడికి మూడు బంగారు నాణాలు ఇచ్చాడు. ఆ నాణాలను యానిస్ కొన్ని విలువైన మాటలతో మార్చుకున్నాడు. దాంతో అతడి పరిస్థితి మారిపోయింది.

అందమైన ఆభరణాలు అనిపించే రంగుల బొమ్మలతో గ్రీసును తలపింపచేసింది అలీకి.



మూడు బంగారు నాణాలు

గ్రీసు కథ

అలీకి, తెలుగు: కె. సురేష్



First Printing © Copyright, 1967, by Alki Zinnerberg. All rights reserved under International and Pan American Copyright Conventions. Published in New York by Pantheon Books, a division of Random House, Inc., and simultaneously in Toronto, Canada, by Random House of Canada Limited. Library of Congress Catalog Card Number: 67-14228 Manufactured in the United States of America.



గ్రీసు దేశంలోని ఒక గ్రామంలో యానిస్ అనే పేద రైతు ఉండేవాడు. అతడు పొద్దున నుంచి పొద్దుగూకే వరకు కష్టపడేవాడు. కానీ అతడి భార్య, కొడుకుల పొట్ట నింప గలిగేవాడు కాదు.



పట్టణంలో బాగా పని దొరుకుతుందని, అక్కడకు వలస వెళ్లాలని యానిస్ నిర్ణయించుకున్నాడు.

తగినంత డబ్బు సంపాదించిన వెంటనే తిరిగివస్తానని చెప్పి కుటుంబానికి యానిస్ వీడ్కోలు పలికాడు.

మరునాడు అతడు తన సుదీర్ఘ ప్రయాణం మీద బయలుదేరాడు.

మూడు వారాలు నడిచిన తరువాత అతడు టర్కీ రాజధాని అయిన కాన్‌స్టాంటినోపుల్ చేరుకున్నాడు.

ఆ పట్టణంలో ఎంత ప్రయత్నించినా యానిస్‌కి పని దొరకలేదు. పని కోసం అతడి లాగా అక్కడికి వచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు. చివరికి ఒక సంపన్నుడికి పనిమనిషి అవసరం ఉందని అతడికి తెలిసింది. యానిస్ వెంటనే అక్కడికి వెళ్లాడు.





ఆ ముసలి సంపన్నుడికి యానిస్ నచ్చటంతో వెంటనే పనిలో పెట్టుకున్నాడు. యానిస్ నమ్మకంగా పని చేశాడు. అందుకు అతడికి ఉండటానికి వసతి, తినటానికి తిండి లభించేవి. అయితే అంతా కలిపి ఒక్కసారే ఇస్తానని అతడి జీతం డబ్బులు యజమానే ఉంచుకున్నాడు.

ఊరిలో పరిస్థితి కంటే ఇదెంతో నయం కాబట్టి యానిస్ దానికి సిద్ధపడ్డాడు.

ఆ విధంగా పది సంవత్సరాలు గడిచాయి. యానిస్‌కి భార్య, కొడుకు బాగా జ్ఞాపకం రాసాగారు. దాంతో ఇంటికి తిరిగి వెళ్లాలనుకున్నాడు. ఆ విషయం యజమానికి చెప్పాడు.

"నువ్వు ఎంతో బాగా పని చేశావు, యానిస్," యజమాని చెప్పాడు. "ఇదిగో నీ సంపాదన," అంటూ అతడికి మూడు బంగారు నాణాలు ఇచ్చాడు.





పది సంవత్సరాల కష్టానికి ఇంత తక్కువ డబ్బా అని యానిస్ నమ్మలేకపోయాడు! అయితే చేసేది ఏమీ లేక అతడు ఆ మూడు బంగారు నాణాలు తీసుకుని బయలుదేరాడు.

అంతలోనే యజమాని అతడిని వెనక్కి పిలిచాడు.

"ఒక బంగారు నాణెం ఇస్తే ఒక మంచి సలహా ఇస్తాను," అన్నాడు యజమాని.

సలహా ఏమీ వద్దని అందామనుకున్నాడు. కానీ, విధేయుడైన యానిస్ ఒక బంగారు నాణెం యజమానికి తిరిగి ఇచ్చాడు.

"గుర్తుంచుకో," యజమాని చెప్పాడు. *"నీకు సంబంధం లేని విషయం గురించి ఏమీ అడగవద్దు."*

"అలాగే, అయ్యా," అన్నాడు యానిస్.

వెళ్లబోతున్న యానిస్‌ని యజమాని మళ్లీ పిలిచాడు.

"మరొక బంగారు నాణెం ఇస్తే మరొక సలహా ఇస్తాను."

ఒక్క నాణెంతోనే ఇంటికి వెళ్లాల్సి వస్తుందని యానిస్ తటపటాయించాడు.

ఎంతో అయిష్టంగానే రెండవ నాణాన్ని ఇచ్చాడు యానిస్. అది తీసుకుని, *"ఒకసారి ఎంచుకున్న దారిని మార్చవద్దు,"* యజమాని చెప్పాడు.

ఆ సలహా గుర్తుంచుకుంటానని చెప్పాడు యానిస్. వెళ్లిపోతున్న అతడిని యజమాని పిలవటం వినిపించింది.

“యానిస్, నీ దగ్గర ఉన్న మూడవ బంగారు నాణెం ఇస్తే నీకు మరొక సలహా ఇస్తాను,” చెప్పాడు యజమాని.

మూడవసారి కూడా అతడు కాదనలేకపోయాడు.

“గుర్తుంచుకో,” యజమాని చెప్పాడు, *“కోపం వచ్చినప్పుడు ఒక రాత్రంతా ఏమీ చెయ్యకు.”*

“అలాగే, అయ్యా,” అంటూ యానిస్ అక్కడి నుంచి బయలుదేరాడు. అన్ని సంవత్సరాల కష్టానికి ముడతలు పడ్డ నుదురు తప్పించి అతడి దగ్గర ఏమీ మిగలలేదు.



కొంత దూరం వెళ్లిన తరువాత యానిస్‌కి ఒక పెద్ద చెట్టు కనిపించింది. ఆ చెట్టు మీద ఒక గంధర్వుడు ఆకులకు బంగారు నాణాలు అంటిస్తున్నాడు. యానిస్‌కి అది చాలా వింతగా అనిపించింది. అంతలోనే యజమాని మొదటి సలహా గుర్తుకు వచ్చి, ఏమీ మాట్లాడకుండా ముందుకు సాగిపోయాడు. నాలుగు అడుగులు ముందుకు వేశాడో లేదో గంధర్వుడు అతడిని పిలవటం వినిపించింది.

"నూట ఏడు సంవత్సరాల నుంచి ఆకుల మీద బంగారు నాణాలు అంటిస్తున్నాను," అతడు చెప్పాడు. "ఇన్ని సంవత్సరాలుగా ఇటుగా వెళ్లిన వాళ్లల్లో ఆగి, ఏమి చేస్తున్నావు అని అడగనిది నువ్వు ఒక్కడివే."



“నువ్వు చేస్తున్న పనితో నాకు సంబంధం లేదు,” యానిస్ చెప్పాడు.

అది విన్న గంధర్వుడు సంతోషించాడు. “నీకు బహుమతి ఇవ్వాల్సిందే,” అంటూ అతడు చెట్టును ఊపాడు. వాన చినుకులు లాగా బంగారు నాణాలు కిందపడ్డాయి. “ఈ బంగారు నాణాలు నీకు పనికి వస్తాయనుకుంటా, వీటిని తీసికెళ్లు.”

తన అదృష్టానికి యానిస్ ఎంతో సంతోషించాడు. జేబులలోనూ, సంచులలోనూ నింపుకోగలిగినన్ని నాణాలు నింపుకున్నాడు. గంధర్వుడికి ధన్యవాదాలు చెప్పి అక్కడినుంచి బయలుదేరాడు. తన యజమాని మంచి సలహా ఇచ్చాడని అనుకున్నాడు.

కొన్ని రోజుల ప్రయాణం తరువాత యానిస్‌కి చాలా గాడిదల మీద సరుకులతో వెళుతున్న ముగ్గురు వ్యాపారస్తులు కనిపించారు. యానిస్ వెళుతున్న వైపే వాళ్లు కూడా వెళుతున్నారు. ఒక గాడిద మీద కూర్చుని సేదదీరుతానని వాళ్లని అడిగాడు యానిస్.

"అలాగే కూర్చో," ఒక వ్యాపారి అన్నాడు. "వాటికున్న బరువుకి మరి కొంత తోడవుతుంది, అంతే."

దాంతో యానిస్ ఒక గాడిద మీద కూర్చున్నాడు.

ప్రయాణం సాగుతోంది.



కొంత సమయానికి వాళ్లు ఒక పూటకూళ్లింటికి చేరుకున్నారు. ఆకలిమీద ఉన్న వ్యాపారస్తులు ఆగాలని అనుకున్నారు. యానిస్‌ని కూడా రమ్మని పిలిచారు. యానిస్‌కి యజమాని రెండవ సలహా గుర్తుకు వచ్చింది. తన దారి వదిలి అతడు వెళ్లదలుచుకోలేదు.

"మీరు వెళ్లండి. నేను ఇక్కడే ఉండి గాడిదలను చూస్తూ ఉంటాను," అని అతడు అన్నాడు. యానిస్ అక్కడే కూర్చుని వ్యాపారస్తులు తిరిగి రావటం కోసం చూస్తూ ఉన్నాడు.

ఆ ముగ్గురూ లోపలికి వెళ్లగానే భూకంపం వచ్చి ఆ ఇల్లు నేలలోకి కుంగిపోయింది.

అందరూ అందులోనే సమాధి అయిపోయారు.



తన యజమాని మాటలు గుర్తుంచుకున్నందుకు యానిస్ సంతోషించాడు. తరువాత అతడు గాడిదలతో తన ప్రయాణాన్ని కొనసాగించాడు.

మరో మూడు రోజుల ప్రయాణం తరువాత వాళ్ల ఊరు చేరుకున్నాడు యానిస్. తన ఊరిని, ఆ వీధులను చూసి అతడు ఎంతో సంతోషించాడు. తన ఇంటి తలుపులు కొడుతున్న అతడి ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.



అతడి భార్య తలుపు తెరిచింది. అయితే ఇన్ని సంవత్సరాల తరువాత అతడిని ఆమె గుర్తించలేదు. యానిస్ కూడా అప్పుడే ఆ విషయం చెప్పదలుచుకోలేదు.

"ఇంత రాత్రి వేళ మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను," అతడు అన్నాడు. "ఈ రాత్రికి నేను, నా గాడిదలు ఇక్కడ బస చేయవచ్చా?"

"ఇంటి లోపలికి మిమ్మల్ని పిలవలేను," ఆ మహిళ అంది. "అయితే, దొడ్లో గాడిదలను కట్టేసి, కొట్టంలో మీరు విశ్రాంతి తీసుకోవచ్చు."

గాడిదలను కట్టేస్తూ, మరునాడు తనను గుర్తించినప్పుడు ఆమె ఎంత ఆశ్చర్యపోతుందో అనుకుంటూ యానిస్ తనలో తాను నవ్వుకున్నాడు.



ఆ సమయంలో ఇంటి లోపలికి వెళుతున్న ఒక మనిషి యానిస్‌కి కనిపించాడు. దాంతో అతడి సంతోషం కాస్తా కోపంగా మారిపోయింది.

"నా కోసం చూసి, విసిగి వేసారిపోయిన నా భార్య మరొక వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్టుంది," అని యానిస్ అనుకున్నాడు.

తపంచాని తన చేతిలోకి తీసుకుని ఇంటివైపుకి వెళ్లసాగాడు. అప్పుడు యజమాని చెప్పిన మూడవ సలహా గుర్తుకు వచ్చింది. కోపంగా ఉన్న అతడు ఆ రాత్రికి ఆగాలని అనుకున్నాడు.

ఆ రాత్రి యానిస్‌కి నిద్ర పట్టలేదు. తెల్లవారింది, కోళ్లు కూస్తున్నాయి. గాడిదలకు మేత వెయ్యటానికి యానిస్ బయటకు వెళ్లాడు. ఇంటి లోపల నుంచి వస్తున్న శబ్దాలను బట్టి తన భార్య కూడా లేచిందని అతడు అనుకున్నాడు.

కొంచెం సేపటికి తలుపు తెరుచుకుంది. రాత్రి యానిస్ చూసిన వ్యక్తి తలుపు దగ్గర నిలబడి ఉన్నాడు. "అమ్మా, నేను పనికి వెళుతున్నాను," అతను చెప్పాడు. "కొంతసేపు తరువాత కూరగాయలు పంపిస్తాను."

యానిస్ గట్టిగా ఊపిరి తీసుకున్నాడు. ఆ మనిషి తన కొడుకే. పదేళ్లల్లో అతడు యువకుడు అయ్యాడు! రాత్రి తాను తొందరపడనందుకు యానిస్ సంతోషించాడు. యానిస్ పరిగెత్తుకుంటూ వెళ్లి తన కొడుకును కౌగిలించుకున్నాడు, తానెవరో చెప్పాడు.

తరువాత తండ్రి-కొడుకులు లోపలకు వెళ్లారు. కుటుంబమంతా సంతోషంలో మునిగిపోయింది. ఆ తరువాత యానిస్ బంగారు నాణాలు ఉన్న సంచి చూపించాడు. గాడిదల మీద సరుకు దించాడు. ఆ రోజు నుంచి యానిస్, అతడి కుటుంబం దేనికీ లోటు లేకుండా జీవితాంతం హాయిగా గడిపారు.

పిల్లల కోసం **అలీకీ** వందలాది పుస్తకాలు రాసింది, వాటికి బొమ్మలు వేసింది. ఆమె తన భర్త ఫ్రాంజ్ బ్రాండిన్‌బర్గ్ తో న్యూ యార్క్ నగరంలో ఉంటుంది. వాళ్లకి జాసన్, అలెక్సా అని ఇద్దరు పిల్లలు.